క్లుప్తంగా

నాట్యాచారిణి పార్వతీ రామచంద్రన్‌కు సన్మానం



సన్మానిస్తున్న గరికపాటి ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ అధ్యక్షురాలు, నాట్య మయూరి ఎ. పార్వతీ రామచంద్రన్ కూచిపూడి నాట్య రంగంలో చేసిన విశేష సేవలకు గానూ ఆమెను గరికపాటి ఆర్ట్స్ సంస్థ ఘనంగా సన్మానించింది. స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం పార్వతీ రామచంద్రన్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శన అనంతరం పార్వతీ రామచంద్రన్‌ను గరికపాటి ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు గరికపాటి కాళిదాసు, ఎంవీఆర్ఎస్ శర్మ దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కొడమంచిలిలోని చినపేటకు చెందిన గుండె చంద్రశేఖర్ (33) ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈయనకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కారణం ఏమిటో తెలియదు గానీ ఈనెల 21న సాయంత్రం పొలంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గ్రామం సమీపంలోని హాస్పిటల్‌కు తరలించగా మెరుగైన వైద్యం కోసం ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపారు.

కోడిపందేల శిబిరంలో పాత్ర ఉందని బదిలీ

ఏలూరు టౌన్: దెందులూరు మండల పరిధిలో కోడిపందేల స్థావరాలపై ఎస్ఈబీ అధికారులు ఇటీవల భారీ ఎత్తున దాడులు చేశారు. పలువురిని అరెస్టు చేయటంతో పాటు కార్లు, మోటారు సైకిళ్ళు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కోడిపందేల నిర్వహణపై దర్యాప్తు చేపట్టిన పోలీస్ ఉన్నతాధికారులు దెందులూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ళను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌సీ సయ్యద్‌బాజీ భీమడోలు పోలీస్ స్టేషన్‌లో పనిచేయాల్సి ఉండగా, దెందులూరు స్టేషన్‌లో అటాచ్‌మెంట్‌పై పనిచేస్తున్నారు. సయ్యద్‌బాజీని వేలేరుపాడు స్టేషన్‌కు బదిలీ చేశారు. మరో హెచ్‌సీ బీవీవీఎస్ రమేష్ ద్వారకాతిరుమల స్టేషన్‌లో పని చేయాల్సి ఉండగా, దెందులూరులో అటాచ్‌మెంట్‌పై విధుల్లో ఉన్నారు. రమేష్‌ను కుక్కునూరు స్టేషన్‌కు బదిలీ చేశారు. తక్షణమే వీరు విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చురుగ్గా సబ్ స్టేషన్ పనులు

- కొద్దిరోజుల్లో ప్రారంభం
- రూ.4.50 కోట్లు ఖర్చు
- విద్యుత్ సమస్యలకు చెక్

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామం గుడివాకలంకలో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రి యంత్రాలు బిగిస్తున్నారు. చాటపర్రు నుంచి గుడివాకలంక, పెదయాగనమిల్లి, తదితర గ్రామాలకు ప్రత్యేక లైన్లు వేస్తున్నారు. పనుల కోసం ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ట్రాన్స్‌కో ఏడీ కె.గోపాలకృష్ణ పర్యవేక్షణలో సిబ్బంది పనులు చకచకా చేస్తున్నారు. కొద్ది వారాల్లో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ కోతలకు ఫుల్‌స్టాప్

సబ్‌స్టేషన్ నుంచి కరెంట్ సరఫరా ప్రారంభమైతే కొల్లేరు ప్రజలను ఏళ్ల తరబడి వేధిస్తున్న విద్యుత్ కోతలకు ఫుల్‌స్టాప్ పడుతుంది. ఇప్పటి వరకు చాటపర్రు సబ్‌స్టేషన్ ద్వారా తిమ్మారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, పెదయాగనమిల్లి, కోమటిలంక గ్రామాలకు అధికారులు కరెంట్ సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామాల్లో వేలాది గృహాలతో పాటు చుట్టుపక్కల వందల ఎకరాల్లో చేపల చెరువులకు సైతం ఇదే సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. ఫలితంగా వేసవి కాలంలో కరెంట్ కోతలు ఏర్పడుతున్నాయి. ఒకే ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేయడం వల్ల ప్రజలు లోఓల్టేజీ సమస్య ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు గుడివాకలంకలో సబ్‌స్టేషన్ నిర్మాణంతో సమస్యలకు చెక్ పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



గుడివాకలంకలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్



వైర్లు బిగిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే కృషి ఎంతో ఉంది



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కృషితో ప్రభుత్వం సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసింది. ఇందుకోసం నిధులు విడుదలయ్యాయి. ఇప్పటికే ప్రజల కోరిక మేరకు అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్తలైన్లు ఏర్పాటు చేశారు. సబ్‌స్టేషన్ పూర్తి అయితే గృహ అవసరాలు, చేపల చెరువులకు వేర్వేరుగా కరెంట్ ఇవ్వడం వల్ల ఇక నుంచి ఎలాంటి సమస్యలు ఉండవు.

– ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

మా చిరకాల కోరిక



గుడివాకలంకలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నది మా చిరకాల కోరిక. ప్రజలు ఎన్నో ఏళ్లగా లోఓల్టేజీ సమస్యతో సతమతమౌతున్నారు. ఇప్పటికే అధికారులు కొత్త ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు వల్ల గృహ అవసరాలకు, వ్యవసాయం, చేపల సాగుకు వేర్వేరుగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. సబ్‌స్టేషన్ పూర్తి కాగానే 24 గంటలూ కరెంట్ సరఫరా అవుతుంది. వర్షాకాలం, వరదల సమయంలో ప్రజలు ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా జీవించవచ్చు.

– జయమంగళ రామారావు, మాజీ ఎంపీపీ

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న చలసాని వెంకట రామారావు

ఏలూరు (టూటౌన్): ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను గత తొమ్మిదేళ్ళ మోడీ పాలనలో నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మిక చట్టాలను కేంద్రం కాలరాస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనింగ్ సమావేశం స్థానిక స్ఫూర్తి భవనంలో యూనియన్ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31న ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై కేంద్ర కార్మిక, రైతు సంఘాలు నవంబర్ 26, 27, 28 తేదీల్లో రాష్ట్ర కేంద్రాల్లో గవర్నర్ కార్యాలయాల వద్ద నిర్వహించతలపెట్టిన ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడారు. ఏఐటీయూసీ నాయకులు కె.కృష్ణమాచార్యులు, సీహెచ్ పుల్లారావు, తొర్లపాటి బాబు, కంకిపాటి బుచ్చిబాబు, భజంత్రీ శ్రీనివాసరావు, పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్: గంజాయి కేసులో పోలీసులకు పట్టుబడకుండా పరారీలో ఉన్న నిందితుడ్ని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు కొత్తపేటకు చెందిన గేదెల సతీష్ మరో వ్యక్తి కలిసి ఈ ఏడాది జూన్‌లో గంజాయి రవాణా చేస్తుండగా ఏలూరు టూటౌన్ పోలీసులు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. గేదెల సతీష్ పరారీలో ఉన్నాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఇటీవల పోలీసులకు చిక్కాడు. అతడ్ని శనివారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఏలూరు శనివారపుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఎ.రమణ అనే వ్యక్తి ఇంట్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో త్రీటౌన్ పోలీసులు దాడి చేసి పేకాటరాయుళ్ళను అరెస్టు చేశారు. సీఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.10,200 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

25 నుంచి నిరసనలు

ఏలూరు (టూటౌన్): ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన జిల్లాలోని సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరువు నుంచి పేదలు, వ్యవసాయ కూలీలు, రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వాలు నిర్దిష్ట ప్రణాళికను రూపొందించాలన్నారు. వలసల నివారణకు తక్షణమే గ్రామీణ ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని కోరారు.

అమ్మవార్లకు విశేష అలంకరణలు



పవర్‌పేటలో మహాదుర్గాదేవిగా రాజ్యలక్ష్మీదేవి



పవర్‌పేటలో మహాదుర్గాదేవిగా కాశీ అన్నపూర్ణమ్మ



పత్తేబాదలో దుర్గాదేవిగా కనకదుర్గమ్మ



అగ్రహారంలో శాకంబరిగా దుర్గాదేవి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో పలు అమ్మవార్ల ఆలయాల్లో జరుగుతున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం నిత్యపూజలు, కుంకుమ పూజలు, శ్రీ లలితా సహస్రనామ పారాయణలు, శ్రీ దేవీ ఖడ్గమాల పారాయణలు నిర్వహించారు. స్థానిక పవర్‌పేట వాసు దేవాలయం ప్రాంగణంలోని శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారికి ఉదయం క్షీరాభిషేకం, ఉభయ దాతలతో విశేష పూజలు, నిత్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం శ్రీ మహా దుర్గాదేవి అలంకరణ, సాయంత్రం శ్రీ మహా కాళికాదేవి అలంకరణ చేశారు. అనంతరం బాలభోగ వినియోగం, సాయంత్రం శ్రీ లక్ష్మి, శ్రీ లలితా సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం విశేష హారతులు, ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి వేంకట విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవర్‌పేటలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి ఉభయ దాతలతో అలంకార పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్ర నామాలతో సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం శ్రీ మహాదుర్గాదేవి అలంకరణ, సాయంత్రం విశేష శ్రీ మహా కాళికాదేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హారతి సేవ నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వినియోగం చేశారు. అనంతరం శ్రీ లలితా సహస్రనామ పారాయణ, అమ్మవారికి విశేష హారతి సేవ, వేద స్వస్తి, దర్బారు సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానందశర్మ విశేష పూజలు చేయగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్థానిక రామచంద్రరావుపేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో అమ్మవారికి శ్రీ దుర్గాదేవి అలంకరణ చేసి ఎరుపు చామంతి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నగరానికి చెందిన కళా దీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్య మయూరి పార్వతీ రామచంద్రన్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. పత్తేబాద శ్రీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి శ్రీ దుర్గాదేవి అలంకరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్థానిక అగ్రహారంలోని శ్రీ సూర్య రెసిడెన్సీలో 8వ రోజున అమ్మవారికి శ్రీ శాకంబరి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా కనిగోళ్ళ శరత్, శిరీష, పసుమర్తి కిరణ్, హర్షిణి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. పసుమర్తి జగదీష్ పర్యవేక్షించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	15
డీ.తిరుమల ఏలురు బీహెచ్ఈఎల్	22.15	10
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	06
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	03
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	06
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	09
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	31
ఏలూరు -తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	22	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)		చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-08
బెండకాయలు	20	కంద	50
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	38
కాకర కాయలు	20- 24	కీరా దోస	44
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	20	అల్లం	130
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20-35
దొండకాయలు	18	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	06
దోసకాయలు	15	పుదీనా	05
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న ఏపీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుమన్

ఏలూరు(మెట్రో): అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ సంఘటితమై జిల్లా స్థాయిలో బలోపేతం కావాలని ఏపీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.సుమన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవన్‌లో జిల్లా స్థాయి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఐకమత్యంతో ముందుకు సాగి ప్రభుత్వాన్ని మెప్పించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తక్కువ వేతనానికి ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అభద్రతాభావంతో పనిచేస్తున్నారని ఆయన అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేకమైన సర్వీస్ రూల్స్‌ను తయారుచేసి అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ పథకాలన్నీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయాలన్నారు. ఏపీ జేఏసీ అమరావతి ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.రమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ ఐక్యమత్యంతో సమస్యలపై పోరాటం చేయాలని, ఏపీ జేఏసీ అమరావతి అండగా ఉంటుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ మహిళలు కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యమంలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకునే క్రమంలో తాము అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు గురునాథ్, సుశీల, లక్ష్మీకుమారి, హైమావతి, రంగ భాస్కర్, కిషోర్, సుబ్బారావు, అనిల్ ఆదిరెడ్డి దుర్గ, నాగేశ్వరమ్మ, రాజేష్, నాగేశ్వర రావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ శాఖల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సామాజిక సేవ ఐవైఎం లక్ష్యం



మందులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చెడు వ్యసనాలకు బానిసలైన యువతను వాటి నుంచి దూరం చేసి వారి ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడమే ఐడియల్ యూత్ మూమెంట్(ఐవైఎం) లక్ష్యమని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ కలీముల్లా ఖాన్ తెలిపారు. ఆదివారం స్థానిక తంగెళ్ళమూడి నెహర్ మసీదులో కామినేని హాస్పిటల్ సౌజన్యంతో గుండె, జనరల్ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలీముల్లా శిబిరాన్ని హాస్పిటల్ సిబ్బందితో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా తమ సంస్థ యువత చేత పలు సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వైద్య నిపుణులు గుండపనేని మాధురిక మాట్లాడుతూ ఐవైఎం సంస్థ ద్వారా తాము ఉచిత క్యాంప్‌నకు విచ్చేసిన వారికి వైద్యం చేయడం సంతోషకరంగా ఉందన్నారు. ఐవైఎం నగర అధ్యక్షుడు ఎస్‌కే ఖాదర్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాజ్జీ, కార్యదర్శి ఎస్‌కే రఫీ, సభ్యులు ఎండీ ఖాన్, నజీముల్లా, పఠాన్ సయ్యద్ లుక్మాన్, ఎస్‌కే సైదు, ఎండీ నజీర్, ఎండీ ఆజం, కామినేని హాస్పిటల్ షుగర్ సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ కొడాలి రామ్ ప్రసీన్, గుండె వైద్య నిపుణులు కళ్యాణ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి అవ్వాలి



కనకదుర్గమ్మను దర్శించుకున్న లక్కోజు రాజగోపాలాచారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తూ ప్రజలను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా దీవించాలని కనకదుర్గమ్మను వేడుకున్నట్లు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి తెలిపారు. స్థానిక పడమర లాకుల వద్ద హనుమాన్ నగర్‌లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దేవీ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజాపాలన సాగుతోందని, రాష్ట్రం సుభిక్షంగా, స్వర్ణాంధ్రప్రదేశ్‌గా విరాజిల్లుతోందన్నారు. రాష్ట్రంలో ఎటువంటి వైరస్‌లు రాకుండా చూడాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండేలా ఆశీర్వదించాలని, ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ళ నాని మరో సారి అత్యధిక మెజారిటీతో గెలవాలని అమ్మవారిని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.